సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024



తల్లిదండ్రులకు కడుపుకోత

ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. - 8లో



ఇదేం 'పని..?'

మశాఖపురంలో సర్పంచ్ చెబితేనే ఉపాధి పని జరుగుతోంది. వైఎస్సార్‌సీపీ మద్దతు దారులకు పని ఇవ్వడం లేదు. - 8లో

డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 27 వరకు పరీక్షలు కొనసాగుతాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. వర్సిటీ పరిధి లో 10052 మంది విద్యార్థులు 55 కేంద్రాల్లో పరీక్షలు రాస్తున్నారు. యూజీ ఎగ్జామినేషన్స్ ఇన్‌చార్జి డీన్ జి.పద్మారావు పర్యవేక్షించారు.

న్యూస్‌రీల్

ఎయిర్‌పోర్టు నిర్మిత ప్రాంతంలో వామపక్షాల పర్యటన



రాంపురంలో వామపక్షాలతో కలిసి నినాదాలు చేస్తున్న ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల ప్రజలు

కాశీబుగ్గ: రాష్ట్ర ప్రభుత్వం బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ఎయిర్‌పోర్ట్ ప్రభావిత గ్రామాలైన వంకులూరు, బీడీమీ రాంపురం, గంగువాడ, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో వామపక్ష నాయకుల బృందం గురువారం పర్యటించి రైతులకు సంఘీభావం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ కోసం బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామని గ్రామస్తులు తెలిపారు. గ్రామాల్లో ప్రదర్శనలు, సభలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కార్గో ఎయిర్‌పోర్ట్ కోసం బలవంతపు భూసేకరణ ఆపాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ పలాస కార్యదర్శి చాపర వేణుగోపాల్, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా నాయకులు వీరస్వామి, బాలకృష్ణ, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్ సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెడితే సహించేది లేదని వారు హెచ్చరించారు.

మతసామరస్యానికి ప్రతీక



పీర్లకొండ యాత్రకి వచ్చిన యాత్రికులు

ఇచ్ఛాపురం: ఏటా మార్గశిర మాసంలో వచ్చే గురువారాల్లో జరిగే పీర్లకొండ యాత్ర మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ గురువారం నిర్వహించినయాత్రకు తండోపతండాలుగా భక్తులు తరలివచ్చారు. పీర్లకొండ యాత్రలో హిందువులంతా లక్ష్మీదేవికి పూజలుచేయడం, ముస్లింలంతా అల్లాకి ప్రార్థనలు చేయడం ప్రత్యేకత. హిందువులంతా మొదటి మెట్టు వద్ద కొబ్బరికాయ కొట్టి ధూపదీప నైవేద్యాలు పెట్టి పూజలు చేసి కొండపైకి ఎక్కడం మొదలుపెడతారు. ఈ యాత్రకి కోల్‌కతా, ఒడిశాలోని కటక్, భువనేశ్వర్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రాలోని విజయవాడ, విశాఖపట్టణం, రాజమండ్రి వంటి దూరప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు.

చిరుద్యోగులు నిరుద్యోగులయ్యారు. సాయం లేక అన్నదాతలు వెన్ను విరగ్గొట్టుకున్నారు. న్యాయం జరగక గంగపుత్రులు బెంగ పెట్టుకున్నారు. పౌరసేవకు ప్రదక్షిణలు తప్పవని సామాన్యుడు తెలుసుకున్నాడు. పథకాల పేర్లు మార్చినంత సులువుగా డబ్బులు ఇవ్వరని విద్యార్థులు అర్థం చేసుకున్నారు. అమ్మ ఒడికి అలవాటు పడిన ఆడపడుచులతో పాలకులు 'తల్లికి వందనం' అనలేకపోయారు. హామీలు ఆరు.. మిగిలింది కన్నీరు అన్నట్టుగా కూటమి తొలి ఆరునెలల పాలన సాగింది. రాజకీయ కక్ష సాధింపులు, గిట్టని వారిపై వేధింపులు, కానివారి తొలగింపులతోనే పాలకులకు సమయం సరిపోయింది. సూపర్ సిక్స్ గురించి ఆలోచన చేసేంత తీరిక కూడా లేకపోయింది.



ఆరు మాసాలు.. దారుణ మోసాలు

- ఆరు నెలల పాలనలో ఘోరంగా మోసపోయిన ప్రజలు
- కూటమి నాయకులకు అనుకూలంగా ఇసుక, మద్యం వ్యవస్థలు
- సామాన్యులకు అందనంత ఎత్తులో నిత్యావసరాల ధరలు
- రాజకీయ కక్షలకు బలైపోయిన చిరుద్యోగులు

టెక్కలి:

సామాన్యులకు అందించే తల్లికి వందనంపై కసరత్తే జరగలేదు...కానీ తమ నేతల జేబులు నింపే ఇసుక పాలసీని మాత్రం ఆగమేఘాలపై అమలు చేశారు. అన్నదాత సుఖీభవ అనడానికి నోరు రాలేదు.. కానీ అనుయాయుల ఖజానాలు నింపే మద్యం పాలసీకి మాత్రం క్షణం కూడా ఆలస్యంగా చేయకుండా పథక రచన చేశారు. మత్స్యకారులకు భృతి ఇవ్వమంటే అర్హుల జాబితా ఇంకోసారి చూస్తామంటూ నెలలు గడిపేశారు.. కానీ గిట్టని వారిని వెతికి వెతికి మరీ ఉద్యోగాల నుంచి తీసేశారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేసే విషయంలో మీనమేషాలు లెక్క పెడుతున్న కూటమి ప్రభుత్వం నేతల జేబులు నింపే పనులైతే మాత్రం ఎలాంటి ఆలస్యం లేకుండా చేసేస్తోంది.

ఊరూరా తిరిగారు.. ఇంటింటికీ ప్రచార పత్రాలు పంచి పెట్టారు. చెవులు చిల్లులు పడేలా కాల్స్ చేసి విసిగించారు. తీరా అధికారం చేతికి వచ్చాక చెప్పిన మాట మర్చిపోయారు. టీడీపీ, జనసేన, బీజేపీ మూకుమ్మడి ప్రభుత్వం హామీలు నిలబెట్టుకోవడంలో ఘోరంగా విఫలమైంది. అధికారం చేపట్టి ఆరు నెలలవుతున్నా.. సూపర్ సిక్స్ హామీలను ఇంకా అమలు చేయలేదు.

ఆపడమే పనిగా..

- ఆరు నెలల పాలనలో రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందజేయకపోగా బీమా భారం వేశారు.
- ధాన్యం కొనుగోలు విషయంలో సరికొత్త విధానం పేరుతో దళారీ వ్యవస్థను మరింత పదిలం చేస్తూ రైతుల నడ్డి విరిచేశారు.
- ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు తల్లికి వందనం అన్నారు, ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి ఈ పథకం ఇస్తామని ప్రసంగాలు చేశారు, విద్యా సంవత్సరం చివరి దశకు చేరుకుంటున్నప్పటికీ ఆ పథకం ఊసే లేదు.
- ప్రతి కుటుంబానికి ఉచిత గ్యాస్ సిలిండర్ అని ప్రకటించారు. ఇప్పుడు తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి మాత్రమే ఉచిత సిలిండర్ అంటున్నారు.
- వసతి గృహాల్లో ఉంటూ ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన చెల్లింపులు నిలిపివేశారు.
- సముద్రంలో వేట నిషేధంలో మత్స్యకారులకు భృతి ఇవ్వలేదు.
- గత ప్రభుత్వంలో సర్వాంగ సుందరంగా మారిన ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న నాడు–నేడు పనులను నిలిపివేశారు.
- గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే అందిన వైద్య సేవలు కూడా ఆపేశారు.
- ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకోవాలంటే అనేక ప్రయాసలు పడాల్సి వస్తోంది. ఆరోగ్యశ్రీ ఆసరా సైతం అందజేయడం లేదు.
- జిల్లాలో అంతర్జాతీయంగా ఎంతో ఖ్యాతి కలిగిన గ్రానైట్ క్వారీలను నూతన విధానం పేరుతో 4 నెలల పాటు అనుమతులు నిలిపివేశారు. దీంతో వేలాది మంది కార్మికులు నడిరోడ్డున పడ్డారు.
- పేద, సామాన్యులపై మరింత ఆర్థిక భారం పడే విధంగా నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకే విధంగా చేశారు.
- పాలన వైపు దృష్టి సారించకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో సామాన్యులు, దళితులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు పేట్రేగిపోయాయి. శాంతి భద్రతలు గాడి తప్పాయి.
- చిరుద్యోగులపై కక్షపూరితమైన తొలగింపు కుట్రలకు పాల్పడ్డారు.

విద్యపై శీతకన్ను



కూటమి ప్రభుతం విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. గత ఐదేళ్లు నిరాటంకంగా అందిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను పూర్తిగా నిలుపుదల చేసేసింది. తల్లికి వందనంపై ఎలాంటి కసరత్తు చేయలేదు. సర్కారీ బడుల్లో ఇంగ్లీషు మీడియం, సీబీఎస్సీ సిలబస్, సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్, బైజూస్ కంటెంట్‌తో కూడిన 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ, టోఫెల్ శిక్షణ, ఐబీ విధానం, నాడు–నేడు ద్వారా పాఠశాలలకు కొత్త శోభ, మౌలిక సదుపాయాల కల్పన వంటివి వైఎస్సార్ సీపీ సమర్థంగా చేసి చూపిస్తే..వాటన్నింటినీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆపేసింది. ఆఖరి దశలో ఉన్న నాడు–నేడు పనులకు నిధులు విదల్చకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

– శ్రీకాకుళం న్యూకాలనీ

నాడు గుండెల్లో పెట్టుకున్నారు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ హయాంలో అన్నదాతను గుండెల్లో పెట్టుకుని చూసుకున్నారు. విత్తనాల నుంచి విక్రయాల వరకు అన్నీ రైతు భరోసా కేంద్రాల ద్వారా నిర్వహించారు. రైతు ఆత్మగౌరవం దెబ్బ తినకుండా, ఎవరి వద్ద క్యూ కట్టే అగత్యం లేకుండా ఆదుకున్నారు.

రాయితీపై విత్తనాలు పంపిణీ 2019-2024వరకు

విత్తనాలు (క్వింటాళ్లలో):	2,88,384
రాయితీ మొత్తం :	రూ 3745.31లక్షలు
ఎరువుల పంపిణీ :	5,37,187 టన్నులు

వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాలు 2019-2021వరకు

లబ్ధిపొందిన రైతు కుటుంబాలు:	3.40లక్షలు కుటుంబాలు
లబ్ధి :	రూ 51.912కోట్లు

వైఎస్సార్ రైతుభరోసా-పీఎం కిసాన్

లబ్ధి పొందిన రైతు కుటుంబాలు:	3.22లక్షలు
మొత్తం లబ్ధి :	రూ. 1919.46కోట్లు

వైఎస్సార్ ఉచిత పంటల బీమా 2019-2022వరకు

లబ్ధి పొందిన రైతులు:	94500
లబ్ధి :	రూ.91.22కోట్లు

వైఎస్సార్ యంత్రసేవా పథకం కింద

సీహెచ్‌సీ గ్రూపులు:	688
రాయితీ :	రూ. 2618.057లక్షలు

ప్రకృతి వైపరీత్యాలు-పంట నష్టపరిహారం 2019-2024

నష్టపోయిన రైతుల సంఖ్య:	27860
పరిహారం :	రూ 9.64కోట్లు

జిల్లాలో 9 అగ్రి ల్యాబ్స్ ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్‌లను విత్తనాలు, పురుగుమందుల నాణ్యత ప్రమాణాలు తెలుసుకునేందుకు ఉపయోగిస్తారు.

మత్స్యకారుల పొట్ట కొట్టారు..



ఎలాగైనా అధికారంలోకి రావాలని ఇష్టానుసారంగా హామీలిచ్చేసి ఇప్పుడు ఎవడేం చేస్తారులే అనుకుని హామీలను అమలు చేయడం లేదు. వేటే ఆధారంగా బతుకుతున్న మా మత్స్యకారులకు ఏటా మే–జూన్ వేట నిషేధ కాలంలో జీవన భృతి గత ఐదేళ్ల క్రమం తప్పకుండా ఇచ్చారు. చంద్రబాబు మాత్రం ఈ వేట నిషేధ భృతిని రూ.10 వేల నుంచి రూ.20వేలకు పెంచేస్తామని చెప్పి.. అసలు ఇంతవరకు ఒక్క రూపాయి కూడా జమ చేయలేదు. మా పొట్ట కొట్టారు. మొత్తం 15,200 మందికి రూ.30.40 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ కూటమి ప్రభుత్వం ఇస్తుందని కూడా నమ్మకం లేకుండా పోయింది.

– కోనాడ నరిసింగరావు, జిల్లా మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడు

నమ్మి మోసపోయారు



ప్రభుత్వం వచ్చి ఆరునెలలు గడిచిపోయాయి.18–50 ఏళ్ల మధ్య గల మహిళలకు ఏడాదికి రూ. 1500 ఇస్తామని చెప్పారు. కానీ ఆ మాట మర్చిపోయారు. చంద్రబాబు మాటలు నమ్మిన వారు మోసపోయారు. ఆరు నెలలవుతున్నా పథకంపై ఎలాంటి కసరత్తు చేయలేదు. – వడమ పుష్పలత, కొత్తూరు గ్రామం, కొత్తూరు మండలం

ఎలాంటి సాయం అందలేదు



గత ప్రభుత్వంలో రైతు భరోసా, పంట నష్టం బీమా, పొలం వద్దకే వచ్చి పంట కొనుగోలు ఇలా ఎన్నో కార్యక్రమాలు చేశారు. నాకు మహంతిపాలెంలో రెండు ఎకరాల ముప్పై సెంట్లు భూమి ఉంది. నిత్యం సాగుబడిలోనే ఉంటుంది. ఇప్పటి వరకు కుటమి ప్రభుత్వంలో ఎలాంటి సాయం అందలేదు. చంద్రబాబు సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రకటించిన రూ. 20వేలు వెంటనే అందించి ఆదుకోవాలి.

– గొర్లె అప్పలనాయుడు, మహంతిపాలెం గ్రామం, రణస్థలం మండలం

ఎదురుచూస్తున్నాం..



మాకు ఇద్దరు పిల్లలు. ఇద్దరూ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. తల్లికి వందనం కింద రూ.30 వేలు వస్తుందని ఎదురుస్తున్నాం. ఇంటిలో ఎందరు పిల్లలు ఉంటే అందరికీ ఏడాదికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆరు నెలలు దాటుతున్నా దీనిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. – దేవి పట్నాయక్, పాతపట్నం

పెట్టుబడి సాయమేదీ..?



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినప్పటికీ ఇంతవరకు పెట్టుబడి సాయం ఇంతవరకు విడుదల చేయలేదు. అన్నదాత సుఖీభవ నిధులను రైతు ఖాతాలకు జమ చేయాలి. చాలా మంది రైతులు ఈ నిధులు వస్తాయని సాగు పెట్టుబడి కోసం అప్పులు చేసుకున్నారు. – కప్పల యుగంధర్, రైతు, కేసరపడ గ్రామం, కంచిలి మండలం

వైఎస్ జగన్ పాలనలో..

- మే నెలలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా, రైతు భరోసా, మత్స్యకార భరోసా అందేవి.
- జూన్ నెలలో జగనన్నతోడు, వైఎస్సార్ వాహన మిత్ర, వైఎస్సార్ చేయూత పథకాలు అందేవి.
- జూలై నెలలో జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ కాపునేస్తం, జగనన్న విద్యా కానుక పథకాలు అందేవి.
- ఆగస్టు నెలలో రైతులకు వైఎస్సార్ సున్నావడ్డీ, ఎంఎస్‌ఎంఈ పారిశ్రామిక రాయితీలు, వైఎస్సార్ నేతన్న నేస్తం, అగ్రి గోల్డ్ బాధితులకు చెల్లింపులు జరిగేవి.
- అక్టోబర్ నెలలో మరో సారి వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న చేదోడు పథకం కింద నాయీబ్రాహ్మణులకు, టైలర్లకు, రజకులకు రూ.10 వేలు అందేవి.
- నవంబర్ నెలలో వైఎస్సార్ ఈబీసీ నేస్తం అందజేసేవారు.
- డిసెంబర్ నెలలో జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన, వైఎస్సార్ లా నేస్తం అందేవి.

సమావేశంలో ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి తదితరులు



ర్యాలీకి తరలిరండి

- రైతు సమస్యలపై నేడు వైఎస్సార్‌సీపీ ర్యాలీ



నరసన్నపేట: రైతన్నలకు చంద్రబాబు చేసిన మోసాన్ని ఎండగడుతూ వైఎస్సార్ సీపీ తలపెట్టిన ర్యాలీని విజయవంతం చేయడానికి అన్ని వర్గాల వారు తర లిరావాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం చేపట్టనున్న ర్యాలీపై స్థానిక పార్టీ కార్యాలయంలో పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతితో కలిసి ఆయన మాట్లాడారు. కూట మి అధికారం చేపట్టిన ఆరు నెలల కాలంలోనే రైతులు సంక్షోభంలో కూరుకుపోయారని అన్నా రు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా.. ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. నరసన్నపేట, పాతపట్నం, టెక్కలి, ఇచ్ఛాపురం నియోజకవర్గాల నుంచి వచ్చే కార్యకర్తలు మడపాం టోల్ గేట్ వద్దకు 9 గంటలకు చేరుకోవాలని కృష్ణదాస్ సూచించారు. పార్టీ శ్రేణులు, రైతులు శుక్రవా రం ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయం దరి జ్యోతిరావు పూలే విగ్రహం వద్దకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం 11 గంటలకు కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. రెడ్డి శాంతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు.

సాంకేతిక సాయమూ అందలేదు

- జిల్లాలో మూలకు చేరిన కియోస్క్ యంత్రాలు
- గత ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా 656 ఆర్‌బీకేల్లో ఒక్కో సెంటర్‌కు రూ.3 లక్షల ఖర్చుతో ఏర్పాటు



టెక్కలి మండలం అక్కవరం రైతు సేవా కేంద్రంలో మూలకు చేరిన కియోస్క్ యంత్రం

టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆరంభంలో విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందజేయలేదు. పంట చేతికి వచ్చిన సమయంలో దళారీలను ప్రోత్సహించే విధంగా ధాన్యం కొనుగోలు వ్యవస్థకు పక్కదారి పట్టించేస్తున్నారు. ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో ప్రాంతాల వారీగా ఏయే భూములకు ఎలాంటి లాభదాయకమైన పంటలు వేయాలి, ఆయా పంటలకు ఎలాంటి పోషకాలు అందజేయాలి, పంటల రక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శాస్త్రవేత్తలతో నిత్యం మమేకమయ్యే విధంగా కార్యక్రమాలను సాంకేతికంగా రైతులకు చేరువగా అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అందులో కియోస్క్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనికి సంబంధించి ఒక్కో సెంటర్‌కు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఖర్చు చేశారు. ఆయా కేంద్రాల నిర్వాహణకు అవసరమైన నిధులు సమకూర్చారు. వీటితో పాటు వ్యవసాయంతో పాటు ఇతర పంటల సాగులో సాంకేతికంగా మెలకువలు నేర్పించేందుకు సుమారు రూ.1.50 లక్షల విలువైన కియోస్క్ యంత్రాలను అందజేశారు. ప్రభుత్వం మారాక ఈ సేవలన్నీ మూలకు చేరిపోయాయి. గత ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా 656 రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు) కియోస్క్ సేవలు అందజేసేవారు. ఇవన్నీ ఇప్పుడు మూలకు చేరాయి.

నిలువునా దగా

- జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఈ–క్రాప్ రిపోర్టు ప్రకారం 3,59,985 ఎకరాల్లో సుమారు 2,94,285 మంది రైతులు సాగు చేస్తున్నారు. అధికార లెక్కల ప్రకారం గుర్తింపు పొందిన వీరందరికీ అన్నదాత సుఖీభవ పథకం అందలేదు. ఇందులో ఈ–క్రాప్‌లో నమోదు కాకుండా ఎంత మంది ఉన్నారో లెక్కకు రాలేదు.
- అలాగే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 8.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేశారు. ఇందులో కేవలం 4.90 లక్షల మెట్రిక్ టన్నుల మేరకు కొనుగోలుకు లక్ష్యం నిర్దేశించారు. ఈ ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు ఒక్కో బస్తాకు అదనంగా 2 నుంచి 3 కిలోల ధాన్యం కాజేస్తున్నారు.
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ప్రభుత్వమే నేరుగా రైతుల తరపున బీమా చెల్లింపులు చేసేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉచిత పంటల బీమాకు మంగళం పాడేశారు. రైతులే బీమా డబ్బులు చెల్లించుకోవాలంటూ అదనపు భారం వేశారు. దీంతో రైతులపై సుమారు రూ. 30 కోట్ల భారం పడనుంది.



రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో స్థానికులు వాగ్వాదం

10 ఇసుక ట్రాక్టర్లు సీజ్

- సీఎం కార్యాలయానికి ఫిర్యాదు అందడంతో కదిలిన యంత్రాంగం
- ఇసుక లోడుతో ఉన్న 10 ట్రాక్టర్లను తమ్మినాయుడుపేట వద్ద అడ్డుకున్న పోలీస్, రెవెన్యూ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేట ఇసుక రీచ్ నుంచి 16వ నంబరు జాతీయ రహదారిపై తరలివెళ్తున్న 10 ఇసుక ట్రాక్టర్లను అధికారులు గురువారం నిలిపివేశారు. తహసీల్దార్ ఎం.సింహాచలంతో కూడిన రెవెన్యూ అధికారుల బృందం, పోలీస్ సిబ్బంది వాహనాలు నిలిపివేశారు. తమ్మినాయుడుపేట ఇసుక రీచ్ నుంచి ట్రాక్టర్లు ద్వారా ఇసుక తరలించి, సమీపంలో పోగులు వేస్తున్నారని, విశాఖపట్నం అర్ధరాత్రి ఇసుక లారీలు, టిప్పర్లలో తరలిస్తున్నారని ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో రెవెన్యూ, పోలీస్ బృందాలు దాడులు చేశాయి. ఇసుక తరలిస్తున్న వారు, స్థానికులు అధిక సంఖ్యలో చేరుకుని పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.



అధికారులు పట్టుకున్న ట్రాక్టర్లు

ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం నిబంధనల మేరకు మాత్రమే తాము ఇసుక తరలిస్తున్నామని, రీచ్‌లలో కూలీలతో ట్రాక్టర్‌లో లోడింగ్ చేసి తీసుకెళ్తున్నామని చెప్పారు. అయితే ఇసుక అక్రమంగా పోగులు వేస్తున్నారని, నిరంతరం అక్రమ రవాణా సాగుతోందని అధికారులు అన్నారు. ఉచితం ముసుగులో అక్రమంగా పోగులు వేస్తే కేసులు పెడతామని హెచ్చరించారు. మైన్స్ అధికారులకు దీనిపై సమాచారం ఇచ్చి, పది ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు

నరసన్నపేట: స్థానిక శ్రీనివాసనగర్‌లో వివాహిత ఆత్మహత్య కేసులో ఆమె భర్త అంధవరపు మధుసూదనరావును నరసన్నపేట పోలీసులు గురువారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరు పరచగా సివిల్ జడ్జి హరిప్రియ 14 రోజుల రిమాండ్ విధించారని నరసన్నపేట ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

కుమారుడికి తలకొరివి పెట్టిన తల్లి


అంత్యక్రియలు నిర్వహిస్తున్న రమ

ఇచ్ఛాపురం : పట్టణంలోని చక్రపాణి వీధికి చెందిన లక్ష్మిరెడ్డి రాజు(33) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. ఈయనకు తల్లి రమ, భార్య రోజా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కు లేకపోవడంతో గురువారం తల్లి రమ కుమారుడికి తలకొరివి పెట్టి అంత్యక్రియలు పూర్తి చేసింది.

గాయపడిన ఇంజినీరింగ్ అసిస్టెంట్ మృతి


తుంగాన చైతన్య(ఫైల్)

నందిగాం: మండలంలోని పెద్దలవునిపల్లి జాతీయ రహదారిపై ఈ నెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన కాపుతెంబూరు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ తుంగాన చైతన్య(32) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 10న నందిగాం ఎంపీడీఓ ఆఫీసులో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై అధికారులు సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన చైతన్య తిరిగి ద్విచక్రవాహనంపై తన స్వగ్రామమైన పాత్రునివలస వెళుతుండగా పెద్దలవునిపల్లి సమీపంలో కుక్క అడ్డుగా రావడంతో బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. చైతన్యకు భార్య అమృత, మూడేళ్ల కుమార్తె హశ్రిత ఉన్నారు. అమృత పలాస మండలం బంటుకొత్తూరు సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. చైతన్య తండ్రి కేశవుడు కొత్తగ్రహారం ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కాగా తల్లి కృష్ణవేణి గృహిణి. భార్య అమృత ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్ల నరికివేతపై గోప్యత ఎందుకో?


పాఠశాల ఆవరణలో టేకుచెట్లు కొట్టిన ఆనవాలు

జలుమూరు: తిమడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న టేకుచెట్లను హెచ్ఎం నరికివేసి సొంతానికి వాడుకున్న ఘటనలో భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. ఏడెనిమిది నెలల కిందట మిషన్‌తో టేకుచెట్లు నరికి తరలించినా ఇంత వరకూ విషయం బయటకు రాకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది, పేరెంట్స్ కమిటీ, మిడ్డేమీల్స్ నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఏ ఒక్కరు కూడా హెచ్ఎంను ప్రశ్నించకపోవడంలో ఆంతర్యం ఏంటన్నది తెలియడం లేదు. బాలికల మరుగుదొడ్లు అధ్వానంగా ఉండటం, మిడ్డేమీల్స్ నాణ్యత లేకపోవడం, చెట్లు మాయం, విద్యార్థుల టీసీల కోసం డబ్బులు వసూలు చేయడంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తోపాటు రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు అందడంతో ఈ విషయాలన్నీ ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఇంత జరిగినా మండల విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

తల్లిదండ్రులకు కడుపు కోత


ప్రవీణ్ నాయక్ (ఫైల్)

- ఆర్జీయూకేటీ ఎస్ఎంపురం క్యాంపస్‌లో మూడో అంతస్తు నుంచి దూకిన ఇంజినీరింగ్ మొదటి ఏడాది విద్యార్థి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- మృతుడు ప్రవీణ్‌నాయక్‌ది ప్రకాశం జిల్లా
- మృతికి కారణాలపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు



విద్యార్థి ఉంటున్న వసతి గృహం బ్లాక్ (ఇన్‌సెట్లో) రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన ప్రవీణ్ నాయక్ వద్ద డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏఓ అధికారి మునిరామకృష్ణ

ఎచ్చెర్ల క్యాంపస్:

పరిగెడుతూ పడిపోతేనే ఆ దెబ్బలకు తాళలేరు. ఆ అబ్బాయి మూడో అంతస్తు నుంచి దూకేశాడు. ఎంత వేదన అనుభవించాడో గానీ చనిపోదామని నిశ్చయించుకుని దూకేసినా.. కొనప్రాణంతో ఉన్నప్పుడు బతకాలని ఆశపడ్డాడు. 'నన్ను బతికించండి .. నన్ను బతికించండి.. ప్లీజ్..' అంటూ స్నేహితులను, వైద్యులను వేడుకున్నాడు. కానీ ఆ బిడ్డ ప్రాణం నిలబడలేదు. తల్లిదండ్రుల ఆశలను అడియాసలు చేస్తూ..బంగారం లాంటి బతుకును ఓ విద్యార్థి బలి చేసుకున్నాడు. ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీలో చదువుతున్న ఆర్.ప్రవీణ్ నాయక్ (18) బుధవారం అర్ధరాత్రి బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. విద్యార్థి స్వస్థలం ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలేం నియోజక వర్గం పుల్లలచెరువు మండలం పీఆర్‌సీ తంగా గ్రామం. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్‌లో బుధవారం అర్ధరాత్రి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న విద్యార్థులకు ఒక్కసారిగా శబ్దం వినిపించింది. వారంతా వచ్చి చూడగా ప్రవీణ్ నాయక్ రక్తపు మడుగులో కనిపించాడు. వెంటనే అతడిని సిబ్బంది క్యాంపస్ అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు. అత్యవసర విభాగంలో వైద్యం అందిస్తుండగా విద్యార్థి మృతి చెందాడు. ఘటన జరిగిన వెంటనే క్యాంపస్ డైరెక్టర్ కొక్కిరాల వెంకటగోపాల ధనబాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ ఆస్పత్రికి వెళ్లారు. విద్యార్థి తల్లిదండ్రులు రవీంద్ర నాయక్, విజయాబాయిలకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. 2021లో ఈ విద్యార్థి ఇక్కడ చేరాడు. రెండేళ్ల పీయూసీ విజయవంతంగా పూర్తిచేసుకున్నాడు. సివిల్ ఇంజినీరింగ్‌లో చేరి చక్కగా చదువుకుంటున్నాడు. పరీక్షల్లో మంచి మార్కులు సైతం సాధిస్తున్నాడు. ఆత్మహత్య చేసుకోవడాన్ని స్నేహితులు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ విద్యార్థి మూడో బ్లాక్‌లో ఏడుగురు విద్యార్థులతో కలిసి రూమ్‌లో ఉంటున్నాడు. పిల్లలంతా తమకు నచ్చినంత సేపు రాత్రి చదువుతుంటారు. అనంతరం నిద్రపోతారు. ప్రవీణ్ నాయక్ వాష్‌రూమ్‌కు వెళ్తానని చెప్పి పోర్టుకో కిటికీలో నుంచి దూకేశాడు. తీవ్ర గాయాలతో ఉన్న విద్యార్థికి సహచరులు సపర్యలు చేస్తుంటే తనను బతికించాలని కోరాడు. ఆస్పత్రిలో సైతం బతికించండి సార్ అంటూ వేడుకున్నాడు. కానీ అప్పటికే తీవ్రంగా రక్తస్రావం కావడంతో చనిపోయాడు. ఘటనపై సమాచారం అందుకున్న శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, జేఆర్‌పురం సీఐ అవతారం, ఎస్ఐ సందీప్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం సైతం క్రైం సీన్ పరిశీలించింది. మంత్రి అచ్చెన్నాయుడు విద్యార్థి మృతికి సంతాపం తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి స్థానిక అధికారులతో మాట్లాడారు. ఇదే క్యాంపస్‌లో విజయనగరం నెల్లిమెర్లకు చెందిన ఒక విద్యార్థిని రెండేళ్ల క్రితం మృతి చెందింది. ప్రస్తుత సంఘటన నేపథ్యంలో విద్యార్థులు ఆందోళన చెందగా సిబ్బంది కౌన్సెలింగ్ ఇస్తున్నారు. విద్యార్థి మృతిపై కేర్‌టేకర్ శాంతారావు ఫిర్యాదు చేశారు.

ప్రేమ వ్యవహారమే కారణం: డీఎస్పీ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద. పక్కనే సీఐ అవతారం

శ్రీకాకుళం క్రైమ్ : ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీ కళాశాలలో ఆత్మహత్యకు పాల్పడిన ప్రవీణ్‌కుమార్ నాయక్ ఘటన కలకలం రేపింది. అయితే ప్రేమ వ్యవహారం కారణంగా విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడని డీఎస్పీ సీహెచ్ వివేకానంద స్పష్టం చేశారు. ఈ మేరకు గూనపాలెంలోని సబ్‌డివిజనల్ కార్యాలయంలో డీఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.

ప్రవీణ్ ఉండే రూమ్‌లో ఓ అబ్బాయి బయటకు వెళ్లి రాకపోవడంతో తలుపులు తీసి ఉంచారని, అప్పటికే మిగతావారితో కలిసి పడుకుని ఉన్న ప్రవీణ్ రాత్రి 1:30 సమయంలో లేచి తలుపు తోసుకుని బయటకు వెళ్లినట్లు విద్యార్థులు చెప్పారన్నారు. అక్కడికి కొద్ది క్షణాల్లోనే మూడో అంతస్తు కిటికీ నుంచి ప్రవీణ్‌నాయక్ దూకేశాడని తెలిపారు. విద్యార్థులు, కేర్ టేకర్లు కలిసి విద్యార్థిని రిమ్స్‌కు తీసుకెళ్లారని, కానీ బ్లీడింగ్ ఎక్కువగా కావడంతో 2.30కు ప్రాణాలు విడిచాడని వైద్యులు ధ్రువీకరించారన్నారు.

ప్రేమించే సమయం ఇది కాదన్నందుకే..

విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎస్ఐ జె.ఆర్.పురం సీఐ అవతారం దృష్టికి రాత్రి సమయంలోనే ఫోన్ చేసి చెప్పడంతో రిమ్స్‌కు, ఘటనా స్థలికి చేరుకున్నారు. సీఐ విచారణ చేయగా.. ప్రవీణ్‌నాయక్ ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నట్లు తెలిసిందని డీఎస్పీ తెలిపారు. ఆమె ఇది ప్రేమించే సమయం కాదు.. చదువుకుందామని చెప్పడంతో దీన్ని భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు. మృతుని సెల్, ల్యాప్‌టాప్‌లను పరిశీలించాల్సి ఉందన్నారు. విజయవాడలో ఉన్న ఎస్పీ మహేశ్వర రెడ్డి ఫోన్ చేసి మానిటరింగ్ చేయడంతో వారి తల్లిదండ్రులను పిలిపించామని, మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ సమక్షంలో విద్యార్థులు, కళాశాల సిబ్బంది, తల్లిదండ్రుల వద్ద స్టేట్‌మెంట్లు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీతో పాటు సీఐ అవతారం, ఒకటో పట్టణ సీఐ పైడపునాయుడు, ఎస్ఐ హరికృష్ణ ఉన్నారు. విద్యార్థి మృతిపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు నివేదిక కోరుతున్నట్లు ప్రకటన విడుదల చేశారు. జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ చేయాలని తెలిపారు.

ఇదేం పని?

- సర్పంచ్ చెబితేనే ఉపాధి పనులట..
- వైఎస్సార్ సీపీ మద్దతుదారులకు పని బంద్
- మశాఖపురం ఫీల్డ్ అసిస్టెంట్ తీరుపై విమర్శలు


మశాఖపురంలో ఉపాధి పనులు చేస్తున్న గ్రామస్తులు

ఇచ్ఛాపురం రూరల్:

'వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు ఉపాధి పనులు ఇవ్వం. ఉప సర్పంచ్‌గా వ్యవహరిస్తున్న సర్పంచ్ కొడుకు చెబితేనే పనులు ఇస్తాం..' ఈ మాట అన్నది ఎవరో కాదు విచారణకు వెళ్లిన ఎంపీడీఓ ముందు సాక్షాత్ ఫీల్డ్ అసిస్టెంట్ అనపాన షర్మిళ. వివరాల్లోకి వెళితే.. ఇచ్ఛాపురం మండలం మశాఖపురం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ గత ప్రభుత్వ హయాంలో తప్పుడు మస్టర్లు, ఒకరి పేరున మరొకరికి పనిలోకి పంపించడం, ఉపాధి పనికి రాని వారి పేర్లు మస్టర్లో వేసి సొమ్ము కాజేసినట్లు ఆరోపణలతో ఉపాధి వేతనదారులు అప్పట్లో ఎంపీడీఓ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. అనంతరం పీడీ చిట్టిరాజు ఆదేశాల మేరకు ఎంపీడీఓ, ఏపీఓలు విచారణ చేసి, తప్పు జరిగినట్లు రుజువు కావడంతో ఆమెను 2023 ఆగస్టు 28న తొలగించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మరలా ఆమెను ఇటీవల ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించారు. తనపై గతంలో ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ మద్దతుదారులపై కక్ష పెంచుకున్న షర్మిళ రెండు వారాలుగా గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులకు సుమారు 60 మంది కూలీలను పనులకు పిలవడం లేదు. టీడీపీ సర్పంచ్ వర్గీయులకు మాత్రమే పనులు ఇవ్వడం పట్ల కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రెండు రోజుల క్రితం ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి మౌఖికంగా ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎంపీడీఓ కె.రామారావు గురువారం మశాఖపురంలో ఉపాధి పనులు జరుగుతున్న పని ప్రదేశానికి వెళ్లి విచారణ చేపట్టారు. ప్రస్తుతం పని చేస్తున్న వారికి మాత్రమే పనులు ఇవ్వాలంటూ సర్పంచ్ ప్రతినిధి చెప్పారని, అందుకే మిగతా వారిని పనులకు పిలవడం లేదంటూ చెప్పడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరిని సమన్వయం చేసుకుంటూ ఉపాధి పనులు ఇవ్వాలని, సోమవారం నుంచి మిగతా వారికి పనులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలంటూ ఆదేశాలు జారీ చేశారు.

కక్షతోనే..



షర్మిళ గతంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉన్న సమయంలో చేసిన అవకతవకలపై ఫిర్యాదు చేయడంతో ఆమెను తొలగించారు. ఇటీవల మళ్లీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించడంతో ఫిర్యాదుదారులపై కక్ష పెంచుకున్న ఆమె రెండు వారాలుగా మమ్మల్ని పనులకు పిలవడంలేదు. నాతో పాటు పాల గీత అనే మేట్‌ను తొలగించారు.

– ఆశి ఇందిర, మేట్, మశాఖపురం

తోలాపి ఘటనపై జెడ్పీ సీఈఓ విచారణ


విచారణ చేపడుతున్న సీఈవో

పొందూరు: మండలంలోని తోలాపి గ్రామ సచివాలయంలో వీఆర్‌వో ఎం.దివాకర్(రేవతిరావు)పై దాడి చేసి కార్యాలయంలో కంప్యూటర్లు ధ్వంసం చేసిన ఘటనపై జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా గురువారం విచారణ చేపట్టారు. ఈ ఘటనపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎంపీడీఓ ఎం.మన్మధరావు ఇప్పటికే విచారణ జరిపి నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. దీనిపై సంతృప్తి చెందని కలెక్టర్ మరోసారి సమగ్ర విచారణ జరపాలని జెడ్పీ సీఈవోను ఆదేశించారు. ఈ మేరకు సచివాలయంలో వీఆర్‌వో, సచివాలయ సిబ్బంది సమక్షంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. తహశీల్దార్ వెంకటేష్ రామానుజులు, ఎంపీడీవో మన్మధరావు, సచివాలయం కార్యదర్శి వినోద్ పాల్గొన్నారు.

బీల ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి


విజయభారతికి వినతి పత్రాన్ని అందిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

శ్రీకాకుళం: సోంపేట మండలంలోని బీల భూముల్లో థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని వ్యతిరేకించిన ఉద్యమకారులపై నమోదు చేసిన కేసుల ఎత్తివేతకు సహకరించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం శ్రీకాకుళం వచ్చిన జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ ఎస్.విజయభారతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమకారులపై పోలీసులు కాల్పులు జరపడంతో పాటు 723 మందిపై కేసులు నమోదు చేశారని తెలిపారు. అనంతరం ఆమె స్పందిస్తూ కేసులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.ఢిల్లీరావు, న్యాయ సలహాదారులు, ఉత్తరాంధ్ర జర్నలిస్టుల సమాఖ్య అధ్యక్షులు చౌదరి లక్ష్మణరావు, అగూరు ఉమామహేశ్వరావు, హమీరుల్లా బేగం, బద్రి సీతమ్మ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ షెడ్‌లో అగ్ని ప్రమాదం

- కాలిబూడిదైన బైక్‌లు, స్పేర్‌పార్టులు
- సుమారు రూ.25 లక్షల ఆస్తి నష్టం


ప్రమాదంలో కాలిపోయిన బైకులు

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరులో పైల భాస్కరరావుకు చెందిన బైక్ మెకానిక్ షెడ్ బుధవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిబూడిదయ్యింది. ఈ ఘటనలో రిపేర్ల కోసం తీసుకొచ్చిన బైక్‌లతో పాటు సుమారు రూ.20 లక్షల విలువైన స్పేర్‌పార్ట్‌లు, కొత్త మిషన్లు, ఎయిర్ ట్యాంకర్, ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.25 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. మంటలు చెలిరేగిన సమయంలో అటువైపుగా వెళ్తున్న వ్యక్తులు గుర్తించి భాస్కరరావుకు ఫోన్ ద్వారా విషయం తెలియజేశారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వెంటనే సిబ్బంది చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే బైకులు, వస్తువులు కాలిబూడిదయ్యాయి. అప్పులు చేసి స్పేర్ పార్టులు, కొత్త మిషన్లు అమ్మకానికి తెచ్చానని, ఇప్పుడన్నీ కాలిపోయాయని బాధితుడు విలపించాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనకు గల కారణాలు ఇంకా తెలియలేదు.

బెల్టుషాపు నిర్వాహకులపై కేసులు

బూర్జ: మద్యం బెల్టుషాపు నిర్వహిస్తున్న సింగన్నపాలెం గ్రామానికి చెందిన కింతలి వెంకటరత్నం, టీడీఆర్ రాజుపేట (అయ్యవారిపేట) గ్రామానికి చెందిన గెంబలి శ్రీనివాసరావులపై కేసులు నమోదు చేసినట్లు బూర్జ ఎస్సై ఎం.ప్రవళ్లిక తెలిపారు. గురువారం తనిఖీలు చేపట్టగా మద్యం పట్టుబడటంతోకేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

14న లోక్ అదాలత్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ నెల 14న జరగనున్న లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టులో గురువారం న్యాయమూర్తులతో ఆన్‌లైన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఒకటో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, 3వ అదనపు జిల్లా జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్, 4వ అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎం.ఫణికుమార్, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వంశధార నిర్వాసితులను ఆదుకోవాలి


గంగరాపు సింహాచలం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రాజెక్టులపై యుద్ధభేరి కార్యక్రమం సందర్భంగా వంశధార నిర్వాసితులకు ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబునాయుడు వెంటనే అమలు చేయాలని నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగరాపు సింహాచలం కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023 ఆగస్టు 10న నాటి ప్రతిపక్ష నాయకుడిగా యుద్ధభేరి కార్యక్రమంలో మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంశధార నిర్వాసితులందరికీ స్పెషల్ ప్యాకేజీ కింద న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా రాష్ట్ర, కేంద్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే మామిడి గోవిందరావులు ఈ విషయాన్ని సీఎం వద్ద ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. నిర్వాసితులను గతంలో టీడీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసినప్పటికీ ఎమ్మెల్యేగా మామిడి గోవిందరావుని గెలిపించారని, అయినా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. హామీని నిలబెట్టుకోకపోతే భవిష్యత్తులో పోరాటాలు తప్పవని స్పష్టం చేశారు.

పట్టపగలే ఆలయంలో చోరీ


అమ్మవారి విగ్రహం

రణస్థలం: మండలంలోని కొచ్చెర్ల పంచాయతీ పాత సుందరపాలెం సమీపంలో ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ నిర్వాహకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఆలయానికి వచ్చి పూజారి నిడుగుంట వెంకట రమణ మూర్తిని కలిశారు. ముహూర్తాలు చూడాలని అడిగారు. ఆలయం పక్కనే ఉన్న ఇంటి ఆవరణలో పూజారి ముహూర్తాలు చూస్తుండగా ముగ్గురిలో ఒకరు అక్కడే ఉండగా.. మిగతా ఇద్దరు ఆలయంలోనికి వెళ్లి చోరీకి పాల్పడ్డారు. పూజారి సాయంత్రం వేళ ఆలయంలో ధూపదీప నైవేద్యాలు పెట్టేందుకు వెళ్లగా అమ్మవారి వెండి కిరీటాలు, వడ్డానం వంటి ఆభరణాలు కనిపించలేదు. కొద్దిసేపటి కింద ముహూర్తాల కోసం వచ్చిన వారే ఈ ఘటనకు పాల్పడి ఉంటారని భావించి జె.ఆర్.పురం పోలీసులకు సమాచారం అందించారు. వీటి విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని సమాచారం.

20న తపాలా అదాలత్

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 20వ తేదీ ఉదయం 12 గంటలకు తపాలా అదాలత్ నిర్వహించనున్నట్లు తపాలాశాఖ సూపరింటెండెంట్ వి.హరిబాబు గురువారం తెలిపారు. శ్రీకాకుళంలోని రెల్లవీధిలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల వద్దనున్న తపాలాశాఖ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద తపాలా అదాలత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తపాలా సేవలకు సంబంధించిన వ్యక్తిగత ఫిర్యాదులు ఈ అదాలత్‌లో చర్చిస్తామని తెలిపారు. తపాలా వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులు ఈనెల 20వ తేదీలోగా తపాలా అదాలత్ అనే శీర్షికన వి.హరిబాబు, తపాలా సూపరింటెండెంట్, శ్రీకాకుళం పోస్టల్ డివిజన్, శ్రీకాకుళం-532001 అనే చిరునామాకు పంపించాలని ఆయన కోరారు. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబోమని, ఫిర్యాదులు వ్యక్తిగతంగా కూడా తీసుకుని అదాలత్‌కు హాజరుకావచ్చని పేర్కొన్నారు.

రేషన్ పంపిణీలో జాప్యం వద్దు

- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, వేర్ హౌసింగ్ గొడౌన్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యం పంపిణీలో ఎటువంటి సాంకేతిక సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించాలన్నారు. కార్డుదారుల ఇళ్ల వద్దకే వెళ్లి బియ్యం సరఫరా చేయాలని స్పష్టం చేశారు. సరుకుల పంపిణీ సక్రమంగా జరగడం లేదన్న ఫిర్యాదులు రాకుండా పనిచేయాలన్నారు. గిరిజన ప్రాంతాలకు సైతం రేషన్ సకాలంలో పంపిణీ చేయాలని సూచించారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ మేనేజర్ టి.వేణుగోపాల్, జిల్లా సరఫరాల అధికారి జి.సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్